# చిల్లర దేవుళ్ళూ..... చిల్లర రాళ్ళూ.....!

**—పాలగిరి వేణు**

మల్హోత్రా అప్పారావు యింట్లో రాత్రి భోజనం... భారీగా వుంది... ఆ భారీతనాన్ని భరించేశక్తి నా చిరుపొట్టకు సాధ్యమయ్యేలా లేదు... అయినా ఓపికున్నంతవరకు మెలమెల్లగా లాగించినా, అప్పారావు దంపతులు మాత్రం "పూర్ యూటర్" అని అననే అనేశారు... ధన్యుణ్ణి.... అంతలోనే వదిలేశారు.... లేకపోతే నా ప్రయాణం వాయిదా వేసుకోవాల్సి వచ్చేది.... 'బస్టాండు'కు తోడువస్తానన్నాడు అప్పారావు . అప్పటికే పది-దాటింది. . తిరిగి వచ్చేందుకు ఆటో ఛార్జీలు దండుగ.... అందులో చలిగాలిగా వుంది... వద్దన్నాను.... అప్పారావు చాలా సంతోషించాడు... -తోడువస్తానన్నది మొహమాట మవుతే- నూ 'బ్లూ మూన్' హోటల్ వెలవెలపోతోంది.... ఒకప్పటి దర్జా, హంగు పూర్తిగా మాసిపోయాయి .. 'కాంపౌండువాల్' పూర్తిగా పడదోయటంతో మరీ బోసిగా వుంది.... అ ప్రక్కనే అప్పారావు యిల్లు.... వీధి రాజమార్గమైనా అంత సులువుగా ఆటోలు దొరకవు... దొరికినా ఏ ప్రాంతానికైనా సరే 'ఎక్స్ట్రా' ఛార్జీ పుచ్చుకోందే కదలరు.... మరి ఆటో వారికి కూడ కొన్ని నియమ నిబంధనలు దానిని మించి కొన్ని ఆశయాలు కూడ వుండడం సహజమే కదా?....

"నాన్నగారూ!" అంటూ కేకేస్తూన్నాడు అప్పారావు జ్యేష్టుడు శీను.... మెయిన్‌గేటు దగ్గర ఆటోకోసం కాపలా కాస్తూ. . 'ఆటో'ను పట్టి లోనికి తీసుకొచ్చాడు.... నా సామాన్లు చూశాక మీటరుమీద ఓ మూడు రూపాయలిమ్మన్నాడు ఆటోవాలా.... నేను 'ఒకటి' అన్నాను.... అప్పారావు "పోనీ ఓ రెండు యిచ్చేద్దూ" అంటూ సామాన్లు ఆటోలోకి పెట్టేశాడు . 'ఆటోవాలా' నామీద కనికరించినట్లుంది... మౌనంగా ఆటో 'స్టార్ట్' చేశాడు. . అప్పారావు, అతడి కుటుంబ సభ్యుల దగ్గర శెలవు పుచ్చుకుని ఆటోలో కూర్చున్నాను.... నా సామానంతా ఓ బ్రీఫ్‌కేసు, జర్నీ బ్యాగ్ యింకా పిల్లలకోసం కొన్న బూట్లు పెట్టె ఒకటీను.... అంతే....? ఛార్జీ విలువ పెంచేసింది సామాను ఆటో కదిలింది.... చలిగాలి రివ్వున వీస్తోంది.. కడుపు బాగా బరువుగాను, కొంత యిబ్బందిగాను వుంది . రాజ్‌భవన్ రోడ్డు సాఫీగా వుండడంవల్ల ఆటో మంచి వేగంగా వెళుతోంది .. 'ఖైరతాబాద్ చౌరస్తా'లో ఆటో ఆపమన్నాను. బడ్డీ కొట్టుకెళ్ళి ఓ కిళ్ళీ కట్టించి, వేసుకుని సిగరెట్ వెలిగించాను మొహమాటంగా ఆటోవాలాకు ఓ కిళ్ళీ, సిగరెట్టు తీసుకొమ్మని చెప్పాను ... ఏక్ జర్దా కాశ్మీర్ ఖిమాం శివాజీ జర్దా జరాజ్యాదా ఔర్. ." అంటూ చండకం పూర్తిచేసి, రెడ్ విల్స్ సిగరెట్ తీసి వెలిగించి, గుప్పున పొగ వదిలాడు .నా మొహమాటం విలువ బాగానే వుంది.... నేను తాగేది చార్మీనార్ సిగరెట్టు....వేసుకునేది సాదాకిళ్ళీ కొట్టు కుర్రాడికి రెండు రూపాయల నోటు అందించాను...

"ఔర్ ఏక్ ఆఠాణా దేవ్ సాబ్" అంటూ చేయి చాపాడు. .. దిమ్మ దిరిగింది తప్పదు అనుకుంటూ రూపాయి నోటు యిచ్చాను . . తిరిగి యీయవలసిన అర్థ రూపాయికిగాను రెండు పావలా వక్కపొడి పొట్లాలు నా చేతిలో పెట్టి, నాకు మాట్లాడే అవకాశం యీయకుండా, వేరే బేరం చూసుకో సాగాడు. ఆ కుర్రాడు బాగానే వుంది ?

"చలింగే సాబ్! బహుత్ ఔర్ హోగయ్!...." అంటూ తుపుక్కున బయటకు వుమ్ముతూ ఆటో స్టార్ట్ చేశాడు ఆటోవాలా.... బుగ్గన కిళ్ళీ . పెదాల మధ్య సిగరెట్ మంచి రాజరీవిలో వెలిగి పోతున్నాడు.... అవును సొమ్మొకడిది.... సోకు ఒకడిదీను.... అవును .. అతణ్ణి అనుకుని ఏం లాభం .? నాకు కిళ్ళీ, సిగరెట్ కావాలని అతడు అడగలేదుగా.... మనమే ఏదో దర్జాకు పోయాం! యిప్పించాం.. పోనీద్దూ!. .

ఆ కొట్టు కుర్రాడు చిల్లర యీయకుండా వక్కపొడి పొట్లాలు అంటగట్టాడు.... మంచి తెలివైన వాడుగా వున్నట్లున్నాడు. ..

సిగరెట్‌వల్ల కొంత రిలీఫ్‌గా వుంది.... ఆటో మంచి 'స్పీడు'గా వెళ్తోంది.. 'మొహంజా మార్కెట్ వైపు వెళ్ళమన్నాను ఆటోవాలాతో.... ఇంకో ఐదు నిముషాల్లో ఆటో 'మార్కెట్' దగ్గర ఆగింది. .

"జల్దీ కరిదియేనా సాబ్! గాడీ హమారా మాలిక్‌కు దేనే కహా...." అంటూ ఆటోవాలా హెచ్చరించాడు. ..

రకరకాల మామిడి పళ్ళు. లైట్ల వెలుగులో ప్రతి పండూ బంగారు రంగులో అద్ది తీసినట్లు మెరుస్తూ వున్నాయి....

ఆయియేనా సాబ్ ఫస్ట్ క్లాస్ మాల్"

ఎలా అని అడిగాను బంగినపల్లి మామిడి పళ్ళ వైపు చూపిస్తూ..

"కెజి పాంచ్ రుపయ్యే..... ఫస్ట్ క్లాస్ మాల్...."

నాలుగు చేసుకోమని బేరం పెట్టాను.... ఒక్క పైసా తగ్గనన్నాడు ఇంకో రెండు నిముషాలు బేరం సాగించాక కెజీకి పావలా తగ్గించాడు. . ఇంతలో 'ఆటోవాడు' భొయ్యి బొయ్యిన 'హారన్' వాయింపిస్తున్నాడు! ." హోగయా! అభీ'ఆరమ్" అంటూ ఆటో వైపు తిరిగి చెప్పేలోగా ఓ ఐదు కెజీలు తూకం వెయడం, పేపర్ బ్యాగ్‌లో వేసి, దారం చుట్టేయడం, ఆ బ్యాగ్‌ను నా చేతుల్లో వుంచేయడం ఒక్క క్షణంలో జిరిగిపోయాయి . తూకంలో ఏదైనా మోసం జరిగిందేమో? మళ్ళీ తూకం వేయమంటే ఏం బావుంటుంది? అసభ్యంగా వుండదూ?.... పాతిక రూపాయల్ని పర్సులోంచి తీసి యిచ్చాను. ." చిల్లర్ నైయేనా సాబ్" అంటూ తన గల్లా పెట్టిలో చిల్లరకోసం వెతికాడు ప్రక్క దుకాణంలో అడగమన్నాను.. .వాళ్ళ దగ్గరకూడ వుండదని వున్నా వాళ్ళివ్వరని నాకు చెప్తూ, నాకు యీయవలసిన రూపాయి పావలాకుగాను, ఏదో బిచ్చం వేస్తున్నట్లు ఓ చిన్న గిలకబారిన పండును నాచేతుల్లో పెట్టాడు... ఇంతలో పేరు బ్యాగు చిరిగి, రెండు మామిడి పళ్ళూ కిందపడ్డాయి.... "అరేరే! క్యాహోగయా సాబ్! అరే అలీమియా హో సాబ్‌కు జరా అచ్ఛాబుట్టీలా తేరే" అంటూ కొట్లో పంజేస్తున్న కుర్రాడిని బుట్టకోసం పంపాడు.... ఆటోవాలా గొడవ పెట్టేస్తున్నాడు. . అలీమియా వచ్చాడు పళ్ళన్నీ బుట్టలోనికి సర్దాడు.... చాలా సంతోషించాను . . "షుక్రియా" అంటూ ఉర్దూలో చెప్పాను.... బుట్ట తీసుకుని బయల్దేరేలోగా అలీమియా 'తీన్ రూపాయ్ దేవ్ సాబ్" అని అన్నాడు . ఎందుకన్నాను.. ? బుట్ట ఖరీదు మూడు రూపాయలన్నాడు మరోసారి తల తిరిగినట్లయింది.... కొట్టతనే ఏదో 'ఫ్రీ'గా బుట్ట యిచ్చాడనుకున్నానేగాని యిలా బుట్టకు కూడ డబ్బు తీసుకుంటాడను కోలేదు.... బుట్ట చూద్దామంటే మరీ పాడుబడి, యిరిగి వుంది .. తప్పలేదు.... ఇంకో ఐదిచ్చాను.... రెండు ఒక్క రూపాయల నోట్లు చేతిలో పెట్టాడు ఆ కొట్టతను ... బుట్ట మోసుకుని వచ్చి ఆటోలో కూచున్నాను.... డ్రైవర్ యింకో డ్రైవర్‌తో బాతాఖానీ కొడుతున్నాడు.... ఆటో ప్రక్కనే బుట్టలు అమ్ముతున్నారు.... బుట్ట ఖరీదెంత అని అడిగాను ఆటోలో కూచునే.... రెండు రూపాయలన్నాడు బుట్టలమ్మే మనిషి.... ఎంత మోసం చేశాడు ఆ పళ్ళ బుట్టతను.... కేజీకి పావలా తగ్గించినట్లే తగ్గించి, లాభమంతా బుట్టలో సంపా-

పించేశాడు.... మరి పళ్ళు తూకంలో....? చూస్తే బావుండేది?.... డ్రైవర్ వచ్చేశాడు.... బండి కదిలింది.... నేను మార్కెట్‌లో చాలా ఆలస్యం చేశానని కొంత విసుక్కున్నాడు.... బస్టాండు చేరాను....మీటరు పదకొండు ముప్పావలా చూపిస్తోంది....మీటరు ఎనిమిది రూపాయలకన్నా ఎక్కువకాదు.... అప్పారావు ఇంటి దగ్గర ఆటో ఎక్కినప్పుడే మీటర్ చూసింటే బావుండేది.... అంటే అప్పటికే ఎక్కడనుంచో 'మీటరు' వేసుకొనే వచ్చినట్లుంది....మీటర్ ఎక్కువ చూపిస్తోందని అడిగాను.... వెయిటింగ్ ఛార్జీలతో సరిపోయిందన్నాడు.... ఆటో చుట్టూ బిచ్చగత్తెలు... చేతుల్లో పసిబిడ్డలు... ప్రతి ప్రయాణికుడి మీద దండయాత్ర చేస్తున్నారు.... వీళ్ళని కంట్రోలు చేసేందుకు పోలీసులు వుంటే బావుండేది... ఆటోలోంచి సామాన్లు బయటకు తీస్తుంటే, యీ బిచ్చగత్తెలు కాళ్ళకు అడ్డం పడుతూ నానా యాతన పెట్టేస్తున్నారు....ఆటో డ్రైవరే వాళ్ళను గదిమాడు.... వాళ్ళు తిట్టుకుంటూ, ఆగిన మరో ఆటో వైపు పోయారు....

చిల్లర యీయమంటూ మూడు ఐదులు ఆటో డ్రైవర్ చేతిలో వుంచాను. "అబ్ క్యా దేనే కో హై సాబ్.... బరాబర్ హో గయా...."

నాకు వళ్ళు మండిపోయింది....మీటర్ ఛార్జీ పదకొండు ముప్పావలా, ఎగస్ట్రా రెండు వెరసి పదమూడు ముప్పావలా.... నేనిచ్చింది పదిహేను... అంటే నాకు యింకా రూపాయి పావలా రావాలని విశదీకరించాను.... నేను ఖైరతాబాద్‌లోను, మొహంజా మార్కెట్‌లోను చాలా ఆలస్యం చేశానని, ఆలస్యం చేయకుండా వుంటే యీపాటికి యింకో సవారి దొరికేదని, లగేజీ కూడ ఎక్కువని తనూ కారణాలు చెప్పాడు.... నాకు విసుగేస్తోంది.... చిరాకేస్తోంది....ఎవరో వచ్చి ఆటోను మాట్లాడుకుంటున్నారు.... నా ముందే ఆటో వెళ్ళిపోయింది.... డ్రైవర్ మాత్రం మీటరును అలావుంచే తీసుకెళ్ళిపోయాడు. పాపం ఆ ప్రయాణీకుల నెత్తిమీద ఎంతభారం పడుతుందో మరి.... వారిమీద అనవసరంగా జాలిపడిపోయాను....

"అరేయ్! పంతులుగారి దగ్గర సామాన్లు అందుకోరా!"

నేను వెనుకకు తిరిగి చూసేలోగా ఒకడు నా సామాన్లన్నీ పట్టేసి గబగబ ముందుకు నడిచాడు....

"బాబ్బాబూ! ఆగు...." అతడు ఆగలేదు....నేనే ముందుకు వెళ్ళి అతడి కాళ్ళకు అడ్డంపడ్డాను.... అతడు ఆగాడు.... లైసెన్సడ్ కూలీ....

"కనీసం చెప్పకుండానే సామాన్లిలా పట్టుకు రావటం తప్పు అని, కూలీ డబ్బులు ఎంత యివ్వాలో మాట్లాడకుండా రావటం చాలా చాలా తప్పు అని ఆ కూలీకి నచ్చచెప్పాను.... అతడు సామాన్లు మాత్రం దించలేదు....

"ఎక్కడికెళ్ళాలి పంతులుగారూ!"

చాలా మర్యాదగా పలకరిస్తున్నాడు గురుడు.... సంతోషం....చెప్పాను.... పండ్ల బుట్ట నన్ను అందుకోమని చెప్పి, ప్లాట్‌ఫారం వైపు వడివడిగా నడిచాడు....నిజంగా చెప్పాలంటే నా సామాన్లన్నిటిలోను ఆ బుట్ట బరువే ఎక్కువగా వుంది....

"ఎంతియ్యామంటావేమిటి?"

"ఎంతో గింత యివ్వండి పంతులూ...

రూపాయి నోటు చేతిలో పెట్టాను చాలన్నట్లు....

"భలేవారండీ....ఇంకో రూపాయి రానీండి"....

"అదేంటి రెండు రూపాయలే...."

"అవును.... రెండు రూపాయలే....

"ఏం బరువుందని...."

"అల్లాంటప్పుడు మీరే తెచ్చుకోవచ్చుగా....

ఛళ్ళున చెంపమీద లాగించినట్లయింది నాకు.... సామాన్లు మోసుకు రమ్మని నేనే అతడిని బ్రతిమాలినట్లు నటిస్తున్నాడు.... ఎంత మోసం....

సమాధానం ఏమని చెప్పాలి....

"రూపాయి యివ్వండి.... ఇంకో బేరం చూసుకోవాలి...."

"పోనీ ఓ అర్ధ రూపాయి తీసుకో?...."

"ఈ కరువు రోజుల్లో రూపాయిక ఏం దొరుకుతుంది.... దొరలు ఓ సారి కాఫీ తాగినట్లు.... మీలాంటి పెద్దలు మంచిమనసు చేసుకుని ఎంతో యింత యిస్తేగాని మా కడుపు నిండదు.... దొరలు దయచేయాలి...." అంటూ చేతులు నలుపుకుంటూ నన్ను హిప్నటైజు చేస్తున్నట్లుంది. రూపాయి నోటు యిచ్చి పంపించేశాను.... ఆకూలి దంతం పెట్టి వెళ్ళిపోయాడు....

ప్లాట్‌ఫారం నిండా క్రిక్కిరిసిన జనం.... అంతా కోలాహలంగా వుంది.... కనీసం సామాన్లు వుంచేందుకు కూడ స్థలం లేదు....

ఈ మధ్య కరీంనగర్ వైపు వెళ్ళే బస్సులకు అంటే ముఖ్యంగా గోదావరి ఖని, ఫెర్టి లైజర్ సిటీ వెళ్ళే బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం తొలగించడంతో ప్రయాణీకులు ఎంతో యిబ్బంది పడుతున్నారు.... రాకపోకల్ని తెలిపే బోర్డు వున్నా, ఏ బస్సు ఏ వేళకు వెళుతుందో 'ఎంక్వయిరీ'లో అడిగి తెలుసుకోవాల్సిందే!....నేను వెళ్ళాల్సిన బస్సు గురించి అక్కడే వున్న ఒకట్రాఫిక్ యిన్‌స్పెక్టర్‌గారిని అడిగాను.... గోదావరి ఖని కెళ్ళాల్సిన బస్సు యింకా గోదావరి ఖని నుండి రాలేదని, అది ఎప్పుడు బయల్దేరి



వెళ్తుందో తమకు తెలియదని, వివరాలు కావాల్సివస్తే 'ఎంక్వయిరీ'లో అడగమని, ఎంతో శాంతంగా చెప్పాడు అతడి పేరు ఉగ్రమూర్తి

టికెట్లకోసం 'క్యూ'లో నిలబడాలి.... నిలబడాలంటే ఎంతో యిబ్బంది వెంట సామాన్లు వుంటే . సామాన్లు ఫ్లాట్‌ఫారం మీదనే పెట్టాలి లేకపోతే సామాన్లని ఓ తెల్సిన వాడిని వెతుక్కుని, అప్ప చెప్పాలి.... 'క్యూ'లో నిలబడ్డా సామాన్లమీదే చూపంతా. 'క్యూ' చూద్దామంటే ఎంతో తొక్కిడి .. సాధారణంగా రెండు, మూడు 'క్యూ'లు వుంటాయి.... గోదావరి ఖని వైపు వెళ్లే వాళ్లందరూ ఒక 'లైను'లో నిలబడి వుంటే, రప్పున 'కౌంటర్' ముందు "అసిఫాబాద్" అంటూ బోర్డు పెడతారు. అసిఫాబాద్ కెళ్లే 'క్యూ' ముందు 'గోదావరి ఖని' బోర్డు.... దాంతో 'క్యూలు' చెల్లాచెదరు. తొక్కిసలాట. . ముందున్నవాడు వెనకవుతాడు . అంతా తారుమారు . .ఇదంతా కంట్రోలర్లు చిద్విలాసంగా గమనిస్తుంటారే తప్ప, ప్రయాణీకులకు ఏలాంటి సాయం చేయడానికి ముందుకు రారు....ఏవేవో 'ఛార్జులు' తిప్పుతూంటారేగాని ప్రయాణీకులకు ఏమి కావాలో అడగరు ఏమైనా 'కంప్లైంట్' చేస్తే, ఒకరికి ముగ్గురు తోడయి, ప్రయాణీకుల్ని దబాయించి నోరుమూయిస్తారు....రోడ్డు రవాణా సంస్థ చేస్తున్నది ప్రజాసేవకాదు.... ప్రజాషేవ్ ...

అంతమంది ప్రయాణీకుల్లో నాకు తెలిసిన వాడెవడు తారసపడలేదు కనిపిస్తే నా సామాన్లు అప్పజెప్పి 'క్యూ'లో నిలబడాలి. 'క్యూ' చాలా పొడుగ్గా వుంది. . నా చూపుకు ఆనేలా సామాన్లని ఫ్లాట్‌పారంమీద వుంచి 'క్యూ'లో నిలబడ్డాను. . .

ఐదు... పదినిముషాలు... అరగంట గడిచింది ఇంకా బస్సు 'స్పాట్' మీదకు రాలేదు. గోదావరి ఖని వచ్చి 'షెడ్'లో కెళ్లిందట.. ఇంకో పది నిముషాలు. గోదావరిఖని కెళ్లే బస్సు స్పీడుగా... అదాటుగావచ్చి 'స్పాట్'లో ఆగింది . తమ తమ సామాన్లందుకుని, ప్రయాణీకులందరూ బస్సును ముట్టడించేశారు... లోన సీట్ల మీదకు బయట నుండే సామాన్లు గిరాటేశారు.....

మా క్యూలో చలనం రెండో 'క్యూ' ఎదురుగ్గా 'కౌంటర్' ముందు గోదావరిఖని బోర్డు వేలాడదీశారు... మా 'క్యూ' ముందు అసీఫాబాద్ బోర్డు. అంతే ఒక్కటే తొక్కిడి .. ఆ 'క్యూ'లో వాళ్లు ఒక్కటే పరుగులు... ఏమయితేనేం? నేను ముందుకన్నా యింకొంచెం ముందున్నాను మా 'క్యూ'లో ...

"గోపాలంగారూ!"

ఎదురుగ్గా శ్రీనివాసులు... మా ఫ్యాక్టరీలోనే పనీ చేస్తున్నాడు. ..

"చిల్లరగా ఓ రెండు యివ్వండి. . ఆటో కివ్వాలి..."

జేబులో నుండి రెండు రూపాయలిచ్చాను... శ్రీనివాసులు పుచ్చుకొని, వెళ్లిపోయాడు....

తనక్కూడా టికెట్ కావాలంటాడేమో అనుకున్నాను .

'క్యూ' కదులుతోంది... జేబులోంచి డబ్బుతీసి

# "చిల్లర దేవుళ్ళూ... చిల్లర రాళ్ళూ!"

లెక్క పెట్టుకున్నాను ఛార్జీకోసం. సరిగ్గా రెండు రూపాయ్యలు తక్కువ వచ్చాయి... పర్సులో వందరూపాయల నోటు వుంది....

నా వంతు వచ్చింది.... వంద నోటిచ్చాను... వూరుపేరు చెప్పాను...

"చిల్లరలేదుసార్! చిల్లరగా వుంటే యివ్వండి..."

నా దగ్గర చిల్లరగా లేదన్నాను....

"మరి మీ 'టిక్కెట్టు డబ్బుపోనూ. . ఓ రెండు రూపాయలు తక్కువగా వుంది మీ కిచ్చే మిగతా డబ్బులో ." అన్నాడు కౌంటర్లో బుకింగ్ కండక్టరు....

"మరీ రెండు రూపాయలు తక్కువయితే ఎలాగండీ!" ముఖం యిబ్బందిగా పెట్టాను.....

చూస్తూ.... చూస్తూ .. రెండు రూపాయలు వదులుకోవాలనిపించలేదు...

"ఏంటండీ ఆలస్యం... మీరు టికెట్టు తీసుకోక పోతే మాకు దారి యివ్వండి" అంటూ విసుగు చూపిస్తున్నారు. నా వెనుక నిలబడి వున్న ప్రయాణీకులు...

"చిల్లర తీసుకొస్తా .. దయచేసి నా టికెట్టు ప్రక్కన వుంచండి..."

అతడు తలూపాడు . నేను 'క్యూ'లో నుండి బయటపడ్డాను చిల్లరకోసం...

నా సామాన్లు ప్లాట్‌ఫారం మీద జాగ్రత్తగా వున్నాయి .. అయినా నా సామాన్ల ప్రక్కన తమ సూట్‌కేసుల మీద కూచున్న ఆ యిద్దరి కుర్రాళ్ళ వేషాలు చూశాక నా కెందుకో అనుమానం కలిగింది. .. చిల్లరకోసం వెళ్తే, వాళ్ళు నా సామాన్లు దాటేస్తే శ్రీనివాసులు ఎక్కడున్నాడో మరి...? అనవసరంగా మొహమాటానికి పోయి ఆ రెండు రూపాయలిచ్చాను.. ఆ రెండే నా దగ్గరుంటే యిలా యిరుకున పడేవాణ్ణికాదు .

'టెలిఫోను బూత్ 'ప్రక్కనే' కూల్ డ్రింక్స్' షాపు వుంది. సామాన్లు వైపు ఒక కన్నేసి "కూల్ డ్రింక్స్" షాపు దగ్గరకెళ్లాను .. "మజా" యివ్వమన్నాను... ఎందుకైనా మంచిదని, ముందుగానే వంద చూపించాను. అదే నేను చేసిన పొరపాటు... బాటిల్ని 'ట్రే'లో నుండి తీసేవాడల్లే వెంటనే వుంచేశాడు....

"చిల్లరలేదు "

"తెచ్చుకోండి?"

"చిల్లరకోసమే 'మజా తాగుతూంటా?"

"చిల్లర యిచ్చే 'మజా' తాగండి..."

"థ్యాంక్స్"

"వెల్‌కంసార్"

చిల్లర ఎలా సంపాదించాలి? ఎక్కడ సంపాదించాలి?

'క్యూ' వైపు పరుగెత్తాను... 'క్యూ'లో ఎవరూ లేరు. కౌంటర్‌లో బుకింగ్ కండక్టరు డబ్బు లెక్క పెడుతూ ఏదో ఛార్ట్ నింపుతున్నాడు.... బస్సు నిండా జనం ఎక్కి కూచున్నారు.

"ఆలస్య మయిపోయింది . టికెట్లన్నీ యిచ్చేశాం . "

'అదెలాసార్! మీకు చ్చెప్పే వెళ్లాగా?"

"భలేవారండీ! ప్రతివాడూ చెప్పినమాట వింటే మాపని అయినట్టే.

"ఇక బస్సుల్లేవుగా...?"

"ఎంక్వయిరీలో అడగండి..."

నేను మానసికంగా చాల బాధపడిపోయాను. ఒక్క రెండు రూపాయలు నాది కాదనుకుంటే నాకు టికెట్టు దొరికేది.. సుఖంగా ప్రయాణం చేసేవాడ్ని... ఏం చేయాలో తెలియక నా సామాన్ల దగ్గర నిస్త్రాణగా నిలబడి పోయాను. .

"ఏంటోయ్! గోపాలం... ఊరికేగా " అంటూ శ్రీనివాసులు ఎదురుగా నిలిచాడు.

"అవును ఊరికే.... కాని టికెట్టు దొరకలేదు.'

"నాకు చెప్తే తెప్పించేవాడ్నిగా..."

"మరి నీవు 'క్యూ'లో లేవుగా

"భలే వాడివోయ్... మనది ఓ మూడు రూపాయలు కావనుకుంటేచాలు ప్రక్కనుండి సంపాదించవచ్చు..." అంటూ నవ్వాడు... పొలక మారింది....

"అవును నిజమే!"

"ఇక బస్సులు లేనట్లున్నాయి... ఇదే ఆఖరి బస్సు..."

"అవునట....

"మరిరాత్రంతా యిక్కడే.

"తప్పదుగా..."

బస్సు బయల్దేరింది. శ్రీనివాసులు పరుగెత్తుకు వెళ్లి బస్సెక్కేశాడు....

సామాన్లన్నీ మోసుకెళ్లి ఓ సిమెంటు బెంచి దగ్గర వుంచాను.. బెంచీ మీద కూచున్నాను.

అసీఫాబాద్ వెళ్లే బస్సొచ్చింది. .. దాంట్లో కరీంనగర్ వెళ్లొచ్చు అక్కణ్ణించి వేరే బస్సు. . ఆ వోపిక లేదు... శారీరకంగా, మానసికంగా అలసిపోయాను..

శ్రీనివాసుల్ని చూస్తూనే నాకు వళ్ళు మండిపోయింది .. అతడికిచ్చిన ఆ రెండు రూపాయలే నన్ను మోసం చేశాయి... ఈ బెంచీ మీద వూసురోమంటూ, దోమల్ని తోలుకుంటూ కూలబడే వాణ్ణికాదు... చలిగా వుంది. 'జర్నీ బ్యాగ్' లోంచి టర్కీ తువ్వాల్ని బయటకు లాగి భుజమ్మీదుగా కప్పుకొని ముంగాళ్ల మీద కూచున్నాను.... ఏకాకిగా...!

పాన్‌వాలా, ఆమ్‌వాలా, ఆటోవాలా, కూలీవాలా అందరూ నాతో ఆడుకున్నారు . చిల్లరకు ముసుగుపెట్టారు.

అదే చిల్లర పేరుతో ఓ రెండు రూపాయలు మిగిల్చుకో బోయాడు కౌంటర్ కండక్టర్...

అయినా ఏమయితేనేం నా జాగరణకు కారణం మాత్రం శ్రీనివాసులు కాదూ?...

నిజంగా నేను అపమర్దుణ్ని కదూ?.... ఛ్.....

చెవుల దగ్గర దోమలు సంగీతం పాడేస్తున్నాయి... మరి.... అయినా తప్పదు యీ రాత్రికి జాగరణ.. □